ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి | ములుగు

5

శనివారం 13 ఏప్రిల్ 2024



ఇక సమరమే!



ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

నియోజక వర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	కడియం కావ్య	సుధీర్‌కుమార్	అరూరి రమేష్
మహబూబాబాద్	బలరాం నాయక్	మాలోతు కవిత	సీతారాం నాయక్

- 'ఓరుగల్లు' ఉత్కంఠకు తెర దించిన బీఆర్ఎస్
- అభ్యర్థిగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించిన అధినేత
- ఇప్పటికే ప్రజల్లోకి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన హస్తం పార్టీ
- వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- గులాబీ కంచుకోటల్లో పాగాకు కాంగ్రెస్, బీజేపీ ఎత్తులు

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారుతో వేడెక్కిన ఉమ్మడి జిల్లా రాజకీయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం.. అటు వరంగల్.. ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించడంతో ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి. కడియం షాక్ నుంచి తేరుకున్న బీఆర్ఎస్.. ఉత్కంఠకు తెర దించుతూ వరంగల్ అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో అభ్యర్థులంతా ప్రజాక్షేత్రంలో 'ఇక సమరమే' అంటూ తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. కుల సమీకరణలతో పాటు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను లెక్కలు వేస్తు నేతలు వ్యూహాలకు పదను పెడుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటలుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు బలమైన అభ్యర్థులను బరిలో దించగా, తమ స్థానాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

అభ్యర్థులు ఫైనల్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం వరంగల్, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ సీట్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్ఎస్ తొలుత మార్చి 13న వరంగల్ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెను ప్రకటించింది. కానీ తాను ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేయలేనంటూ మార్చి 27న బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కావ్య 30వ తేదీన తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ ఆమెను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. తెరపైకి పలువురి పేర్లు రావడం, అనేక నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం బీఆర్ఎస్ అధినేత హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌కుమార్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో రెండు వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ఇక బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలను ఖరారు చేశారు. ఇక బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను బరిలో ఉన్నారు. మాజీ ఎంపీలు బరిలో ఉండటంతో మానుకోట రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాగా, బీజేపీ నుంచి బరిలో దిగుతున్న ఇద్దరు అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాంనాయక్ బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నేతలే. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారే. వరంగల్ బరిలో ఉన్న ముగ్గురు కూడా బీఆర్ఎస్ నేపథ్యం ఉన్న వారే కావటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎవరు ఓట్లకు ఎవరు ఎసరు పెడుతారో అనే ఉత్కంఠ కూడా అభ్యర్థుల్లో నెలకొంది. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానవర్గం కుల సమీకరణలకు పెద్దపీటలు వేశాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆ సామాజిక వర్గం నేతలకే టికెట్లు కేటాయించాయి. మాదిగ ఉపకులం అభ్యర్థిని కాంగ్రెస్ బరిలో దించింది. మూడు పార్టీలు కూడా మాదిగ సామాజిక వర్గం నుంచే అభ్యర్థులను బరిలో దించటంతో మాల సామాజిక వర్గం ఓట్లు ఎటువైపు మొగ్గు చూపుతాయే అనేది చర్చనీయాంశంగా మారింది.



ప్రజాక్షేత్రంలోకి అభ్యర్థులు..

వరంగల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు, మహబూబాబాద్‌లో మూడు పార్టీలు అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావటంతో ప్రజాక్షేత్రంలోకి దిగారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పరకాల, భూపాలపల్లి, స్టేషన్‌ఘనపూర్ తదితర నియోజక వర్గాల్లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో తన చేరిక, తన కులం, మతంపై వస్తున్న ఆరోపణలు, విమర్శలను తిప్పికొడుతూ ప్రసంగాలు సాగిస్తున్నారు. ఇక ఊరూరా తిరిగి ఇంటింటి ప్రచారానికి

మిగతా 7వ పేజీలో..

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి

- జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌కు వరంగల్ లోక్‌సభ టికెట్
- అధికారికంగా ప్రకటించిన అధినేత కేసీఆర్



రాంనగర్, ఏప్రిల్ 12: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధినేత కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వరంగల్ లోక్‌సభ పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో భేటీ అయ్యారు. నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సుధీర్‌కుమార్ పేరును అధికారికంగా ప్రకటించారు.

కాగా, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను తొలుత బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆమె అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపై కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఈ క్రమంలో పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి తీసుకువచ్చి బరిలో నిలపాలని మంతనాలు జరిపారు. బీఆర్ఎస్ నేతల సూచన మేరకు ఫామ్‌హౌస్ సమీపంలోని ఒక హోటల్‌లో రాజయ్య బస చేశారు. కేసీఆర్ పిలుపు కోసం వేచి ఉన్నాడు. కేసీఆర్ భేటీలో జిల్లా నేతలు సైతం రాజయ్య వైపే మొగ్గు చూపినప్పటికీ

మిగతా 7వ పేజీలో..

బయోడేటా

పేరు	: మారపెల్లి సుధీర్‌కుమార్
కులం	: మాదిగ (ఎస్సీ)
పుట్టిన తేదీ	: 30-8-1962
విద్యార్హతలు	: ఎం.డి. (యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్)
తండ్రి పేరు	: మారపెల్లి జాన్
తల్లి పేరు	: కిరీటమ్మ
భార్య	: శోభారాణి(మెడికల్‌ఆఫీసర్)
కుమారుడు	: సుజన్‌కుమార్ (బీటెక్)
కూతురు	: సుకీర్తి (అసిస్టెంట్ సివిల్ సర్జన్)
నివాసం	: ముల్కనూర్, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

- నా బిడ్డగా కావ్యకు నా కులమే వర్తిస్తుంది
- నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు
- బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తప్పుకుంటాం
- మాదిగ జాతి ద్రోహి మందకృష్ణ : కడియం శ్రీహరి



7

కడియం ఎమ్మెల్యే కాకముందే నేను కాంట్రాక్టర్‌ను..

- ఆయన ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు
- ఇన్నాళ్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఎందుకు గుర్తుకు రాలేదు?
- ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి
- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్



7

వడ్డీ వ్యాపారుల్లో వణుకు

పోలీసులకు చిక్కకుండా అప్రమత్తం

మరికొందరిపై చర్యలకు రంగం సిద్ధం?

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 12 : భూపాలపల్లి జిల్లాలో వడ్డీ వ్యాపారుల్లో వణుకు మొదలైంది. పోలీసులు ఏకకాలంలో వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పోలీసుల దాడులకు ముందు గిరిగిరి(డైలీ) అప్పు, నెలవారి అప్పు ఇచ్చిన వ్యాపారులు.. రోజువారి వసూళ్లు చేసే వారు. ప్రస్తుతం వీరిలో కొంత మంది బయటకు వెళ్లడం లేదని, బహిరంగంగా వసూళ్లకు వెనకడుగు వేస్తున్నట్లు చర్చ సాగుతోంది. రోజూ వసూళ్లకు వచ్చే వారు రెండు రోజులుగా రాకపోవడంతో బాకీదారులు వ్యాపారులకు ఫోన్ చేస్తే కూడా స్పందించడం లేనట్లు సమాచారం. అలాగే పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. డాక్యుమెంట్లన్ని తెలిసిన వ్యక్తుల ఇళ్లకు చేరవేసినట్లు సమాచారం. మరోవైపు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్న మరికొంత మందిపై నిఘా పెట్టిన పోలీసులు త్వరలోనే వారిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అధిక వడ్డీ వ్యాపారులతో పాటు గిరిగిరి దందా చేసే వారిపై కూడా పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



భూపాలపల్లిలో ట్రాక్టర్ ట్రాలీకి రేడియం అతికిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 12 : ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వాహన యజమానులు, డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ ఎ.సంపత్‌రావు సూచించారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణ కు ట్రాక్టర్ల వెనకాల రేడియం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. అతివేగంగా వెళ్లవద్దని కోరారు. ఓవర్‌టేక్ వంటివి చేయరాదని సూచించారు. అలాగే వాహనాలకు ఇండికేటర్లు, రేడియం స్టిక్కర్లు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో ముందు వెళ్లే వాహనం కనబడేలా తప్పక రేడియం స్టిక్కర్లను అమర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన

కాటారం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పలు రకాల వాహనాలకు ప్రమాదాల నివారణ కోసం రేడియం స్టిక్కర్లు వేసే కార్యక్రమం పోలీసులు శుక్రవారం చేపట్టారు. కాటారం ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్లు, ట్రాక్టర్లు, ఆటోలకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై వాహనాల యజమానులు, డ్రైవర్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్లకు బ్లాక్ ఫిల్మ్ వాడొద్దని, సైరన్లు పెట్టొద్దన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్లపై తిరగరాదని, ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాక్టర్లపై మైనర్లను డ్రైవర్లుగా పెట్టుకుంటే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కారొబార్ నుంచి శాసన సభాపతి దాకా..

బుచ్చిపంతులుగా సుపరిచితులైన దుద్దిళ్ల శ్రీపాదరావు

నేడు 23వ వర్ధంతి



కాటారం, ఏప్రిల్ 12 : మంథని ప్రాంత ప్రజలకు బుచ్చిపంతులుగా సుపరిచితులు.. గ్రామ స్థాయి నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన చట్టాలు రూపొందించే శాసనసభ స్పీకర్‌గా ఎదిగారు.. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అజాత శత్రువుగా పేరు సంపాదించుకున్నారు. అయితే కొన్ని పరిస్థితుల్లో 1999 ఏప్రిల్ 13న అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్ల చేతిలో హతమయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 23వ వర్ధంతిని శనివారం పలు చోట్ల నిర్వహించడానికి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం శ్రీపాదరావు జయంతి సందర్భంగా అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేసింది.

ధన్వాడ నుంచి శ్రీపాదరావు ప్రస్థానం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా(ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా) కాటారం మండలంలోని ధన్వాడలో 1935 మార్చి 2న శ్రీపాదరావు జన్మించారు. మూడవ తరగతి వరకు ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాడు. 10వ తరగతి వరకు మంథనిలో చదివారు. ఉన్నత విద్యాభ్యాసం, న్యాయవాద విద్యను హైదరాబాద్, నాగ్‌పూర్‌లో చేశారు. యుక్త వయస్సులోనే తెలంగాణ విమోచనోద్యమంలో పాల్గొన్నారు. ధన్వాడ గ్రామస్థులతో పాటు నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు శ్రీపాదరావును బుచ్చిపంతులు, చిన్నపంతులుగా పిలుచుకునేవారు.

కారొబార్ నుంచి స్పీకర్ దాకా..

ధన్వాడ గ్రామ పంచాయతీలో కారొబార్‌గా పనిచేసిన శ్రీపాదరావు 1964లో రాజకీయాల్లోకి ప్రవేశించి ధన్వాడ సర్పంచ్‌గా మూడు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1980లో ఎల్ఎంబీ(భూమి తనఖా బ్యాంక్) చైర్మన్‌గా పని చేశారు. 1983, 1985, 1989లో వరుసగా మూడుసార్లు మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1991 ఆగస్టు నుంచి 1995 జనవరి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 1999 ఏప్రిల్ 13న పీపుల్స్‌వార్ శ్రీపాదరావును మహదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో హతమార్చారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మూడో కుమారుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, వైఎస్సార్ ప్రభుత్వంలో విప్, మంత్రిగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

'గుండ్లవాగు'కు నిర్లక్ష్యపు గండం

- సాగు లక్ష్యానికి దూరంగా ప్రాజెక్టు
- చివరి పొలాలకు అందని సాగునీరు
- కాలువల విస్తరణలో పట్టించుకోని పాలకులు
- స్పిల్‌వే, తూములలో లీకేజీలు
- డ్యామ్ సేఫ్టీ జాబితాలోకి చేర్చి మరమ్మతు చేస్తేనే ఉపయోగం



గుండ్లవాగు ప్రాజెక్టు (ఫైల్)

గోవిందరావుపేట, ఏప్రిల్ 12 : ప్రతిష్ఠాత్మక జలయజ్ఞం పథకానికి నిలువెత్తు సాక్ష్యం గుండ్లవాగు ప్రాజెక్టు. ఈ చిన్నతరహా నీటిపారుదల వ్యవస్థ అప్పట్లో ఒక సంచలనం. కానీ, పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రాజెక్టు 'లక్ష్యం' నెరవేరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా కాల్వలను తవ్వించక, మరమ్మతులు చేయించకపోవడంతో ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడింది. గత పాలన లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్న కొత్త సర్కారు గుండ్లవాగుపై దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

20 ఏళ్ల క్రితం పునాదిరాయి

వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారి ములుగు పర్యటనకు వచ్చిన సందర్భంగా గుండ్లవాగు ప్రాజెక్టు నిర్మాణానికి తొలి అడుగు పడింది. గోవిందరావుపేట మండలం కర్లపల్లి సమీపంలో 2004లో రూ.10 కోట్ల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. 2006 ఆగస్టు 4న భారీ వరదలు ముంచెత్తడంతో కట్ట తెగిపోయింది. ఆతర్వాత రూ.6 కోట్లను అదనంగా విడుదల చేసి పనులు పూర్తిచేశారు. కుడి, ఎడమ కాల్వల నిర్మాణం, భూసేకరణ ఖర్చులు కలిపి సుమారు రూ.35 కోట్ల వరకు ఖర్చయ్యాయి. 4,500 ఎకరాలకు రెండు పంటలకు సరిపడా నీటిని అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

బలహీనపడ్డ కట్ట.. తూముల్లో లీకేజీలు

ఓసారి కొట్టుకుపోయిన కట్టను డిజైన్ మార్పు చేసి పునర్నిర్మించినప్పటికీ గడిచిన 15 ఏళ్ల కాలంలో కట్ట బలహీన పడింది. ఈ మధ్యకాలంలో భారీ వర్షాలు, వరదలకు కోతకు గురైంది. సమయంలో రెండు తూములలో లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా పోతోంది. ఈసారి యాసంగిలో ఆయకట్టు చివరి పొలాలకు నీరందకపోవడంతో 200 ఎకరాలలో వరిపంట ఎండిపోయింది. ప్రతీసారి తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకు వస్తుండగా భవిష్యత్‌లో ప్రమాదం ఏర్పడే అవకాశాలు లేకపోలేదు. డ్యామ్ సేఫ్టీ జాబితాలో గుండ్లవాగు ప్రాజెక్టును చేర్చి పూర్తి స్థాయిలో మరమ్మతు చేస్తేనే భవిష్యత్ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రెండు కిలోమీటర్ల మేర పొడిగించాల్సిన ఎడమ కాలువ

అసంపూర్తిగా కాల్వల నిర్మాణం

గుండ్లవాగు ప్రాజెక్టు పనులు పూర్తయినప్పటికీ కాలువల పనులు పూర్తికాక పోవడంతో పొలాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. అధికారుల అంచనా ప్రకారం పూర్తి సాగు 3,500 ఎకరాల వరకు ఉంది. అయితే రాంనగర్ శివారు వరకు కాలువ పనులు జరగగా అటు తర్వాత వర్షాకాలం నీరందితేనే పంటలు పండే సుమారు 500 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు మరో రెండు కిలోమీటర్ల మేర కాలువను పొడిగించాల్సి ఉంది. ఈ పనులు జరిగితే దుంపెల్లిగూడెం, రాంనగర్, ఎల్బీనగర్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాకాలం సరైన వర్షాలు పడిన సమయంలోనే పంటలు సంపూర్ణంగా చేతికి వస్తున్నాయి. లేకపోతే ఎండిపోయే పరిస్థితులు ఉంటాయని రైతులు తెలిపారు. కాలువ పొడిగింపు పనులు జరిగితే కనీసం ఒక పంట ఖచ్చితంగా చేతికి అందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

పెండింగ్‌లో పరిహారం..

పంట కాల్వల తవ్వకం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు నేటికీ ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. ఓ పక్క భూములు కోల్పోయిన రైతులు సాయం కోసం ఎదురుచూస్తూనే చివరి పొలాలకు నీరందక ఏటా నష్టాల పాలవుతున్నారు. 2009లో సర్వేచేసి 2012లో కాల్వల తవ్వకం పూర్తిచేశారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం సరిపోదని రైతులు వాదించడంతో పంపిణీని నిలిపివేసిన ప్రభుత్వం అప్పటి నుంచి హోల్డ్‌లో పెట్టింది. భూసేకరణ చేపట్టి పదేళ్లు పూర్తయినా పరిహారం అందక రైతులు వేదన చెందుతున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం రూ.2.66 కోట్ల నిధులను విడుదల చేయగా పంపిణీ చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే దెబ్బతిన్న స్పిల్‌వే(మత్తడి) ఎత్తు మరో 5 మీటర్లు పెంచడంతో పాటు తూముల మరమ్మతు, కాల్వల విస్తరణ, పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఈమేరకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి సీతక్కను కలిసిన రైతులు

గుండ్లవాగు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల రైతులు రాష్ట్ర మంత్రి సీతక్కను కలిశారు. భూసేకరణ పరిహారం, కాల్వల విస్తరణ, ప్రాజెక్టు మరమ్మతుకు సత్వర చర్యలు తీసుకోవాని కోరారు. ఎమ్మెల్యేగా గతంలో రైతుల పక్షాన పోరాటం చేసిన సీతక్క సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. కాగా, దశాబ్ద కాలంగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని, మంత్రి హామీతో నిరీక్షణ ఫలిస్తుందనే నమ్మకం కలిగిందని గుండ్లవాగు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు బాషా తెలిపారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సర్వే చేసి పునరుద్ధరణ చర్యలు చేపడితే మొత్తం 4,500 ఎకరాలకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని ఆయన అన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

మహదేవపూర్, ఏప్రిల్ 12: మండలంలోని కాళేశ్వరం సమీపంలో గల గ్రావిటీ కాలువ వద్ద 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాళేశ్వరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా బొలేరో వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెన్నూరుకు చెందిన రమేష్, ఎల్లక్కపేటకు చెందిన రాజిరెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై భవానీ సేన్ తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



హనుమకొండ టౌన్, ఏప్రిల్12: పోలీసునంటూ భర్త లేని ఒంటరి మహిళను మోసం చేసిన ఘటనలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మహిళతో రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచకు చెందిన మామిడి కిరణ్ పోలీసునంటూ పరిచయం పెంచుకున్నాడు. వివాహం చేసుకొని, తన ఇంటిని బాధిత మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుతానని మాయ మాటలు చెప్పి మహిళ నుంచి బంగారు ఉంగరం, పుస్తెలతాడు, చైన్ తీసుకున్నాడు. వివాహం విషయం ప్రస్తావించగానే ఇంకోసారి వివాహమంటే చంపుతానని బెదిరించి మహిళ నుంచి మరో లక్ష ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేని బాధిత మహిళ ఈనెల 7న ఫిర్యాదు చేయగా పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం హనుమకొండ బస్టాండ్‌లో నిందితుడి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి పుస్తెలతాడు, ఏపీ పోలీసుశాఖతో ఉన్న నకిలీ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ధార్మిక భవన్ స్థలంపై

కొత్త వివాదం

- స్థలం తమదంటున్న మేడారం జాతర పూజారులు
- వేదపాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించకుండా మెలిక
- స్థలం తమదేనని దేవాదాయశాఖ అధికారుల స్పష్టం

హనుమకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధార్మికభవన్ స్థలంపై కొత్త వివాదం తలెత్తింది. భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూజారులు ఈ కొత్త వివాదానికి తెరతీశారు. ధార్మిక భవన్ నిర్మించిన స్థలం తమదేననే వాదన లేవనెత్తారు. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించి గెస్ట్‌హౌస్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి ఈ స్థలం అప్పట్లో ఇచ్చారని మేడారం పూజారులు వాదిస్తున్నారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా రూ.కోట్ల విలువ చేసే ధార్మిక భవన్‌ను భద్రకాళి దేవస్థానానికి స్వాధీనం చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నది వారి ఆలోచన. ఈ ప్రయత్నాలను ఆపకపోతే మేడారంలో విధులను బహిష్కరిస్తామని కూడా హెచ్చరిక చేశారు. మేడారం పూజారులు పెట్టిన ఈ మెలికతో ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలింపుపై అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

రికార్డుల్లో దేవాదాయ శాఖదే..

దేవాదాయ శాఖ వాదన మరో విధంగా ఉంది. ఈ స్థలం దేవాదాయ శాఖదేనని అధికారులు చెబుతున్నారు. స్థలానికి సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులు కూడా ఇదే చెబుతున్నాయి. సర్వే నెంబరు 725లో 1014 గజాల స్థలాన్ని 1993 సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి కలెక్టర్ బి7/55/93 ద్వారా దేవాదాయ శాఖకు కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా వరంగల్-హనుమకొండ ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఈ స్థలాన్ని వాస్తవానికి మొదట ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు జీవితబీమా సంస్థకు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అయితే అప్పటికే భద్రకాళి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ధర్మసత్రాల నిర్మాణానికి స్థలం కోసం కలెక్టర్‌కు వినతి చేసి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జీవిత బీమా సంస్థకు ఈ ఇక్కడ కాకుండా మరోచోట కేటాయించారు. ఆలా ఈస్థలం దేవాదాయ శాఖకు కేటాయించినట్టు సమాచారం.

లోకాయుక్తకు వెళతాం..

ధార్మిక భవన్‌పై మేడారం పూజారుల ఈకొత్త వివాదం వెనుక ఓ అధికారుల తెర వెనుక పాత్ర ఉన్నట్టు అనుమానం కలుగుతోందని కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి నుంచి వేద పాఠశాలను ధార్మికభవనంలోకి తరలించడం ఇష్టం లేనందువల్ల పరోక్షంగా మేడారం పూజారులను రెచ్చగొట్టడం ద్వారా అడ్డుపుల్ల వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. అవసరమైతే దీనిపై లోకాయుక్తకు వెళతామని స్పష్టం చేశారు.

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

● కులం, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు.. ● నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు.. ● మీడియాతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తన కూతూరు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య కులం, వివాహం వంటి వ్యక్తిగత విషయాలపై రమేశ్ మాట్లాడడం అనైతికమని ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన అరూరి రమేశ్‌పై విరుచుకుపడ్డారు. కావ్య వరంగల్‌లో జన్మించి ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిందన్నారు. వర్ధన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరుగా పని చేసిందన్నారు. కావ్య ముస్లింను వివాహం చేసుకున్న విషయాలపై అరూరి రమేశ్ ఇష్టారాజ్యంగా మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, విమర్శలు ఉంటాయని, కానీ వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడం అనైతికమని పునరుద్ఘాటించారు. కబ్జాల చరిత్ర ఉన్న రమేశ్‌ను ఊళ్లలోకి రానివ్వకుండా ప్రజలు ఎదురు తిరిగారని చెప్పారు. అలాంటి చరిత్ర తమకు లేదన్నారు.

కడియం కావ్య వివాహం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ మేరకు జరిగిందని శ్రీహరి వివరించారు. ఈ చట్టం ప్రకారం మతాంతర వివాహం జరిగినప్పటికీ భార్యభర్తలు ఎవరికి వారు తమ మతాన్ని ఆరాధించుకోవచ్చని తెలిపారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మతం మారినా కులం మారదని వివరించారు. పిల్లలకు తండ్రి కులమే వర్తిస్తుందన్నారు. ఈ మేరకు తన బిడ్డగా కడియం కావ్యకు తన కులమే వరిస్తుందని కడియం శ్రీహరి వివరించారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన లేని అరూరి రమేశ్.. ఇతర బీజేపీ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కావ్య మతం, కులం, ప్రాంతం విషయంలో చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కడియం కావ్య ఎస్సీ కాదని నిరూపించగలరా? అంటూ శ్రీహరి సవాల్ విసిరారు. ఎవరెన్ని చిల్లర రాజకీయాలు చేసినా కావ్య గెలుపు ఖాయమైందని శ్రీహరి ధీమాగా చెప్పారు.

అరూరి రమేశ్ క్లాస్-1 కాంట్రాక్టర్‌గా, ఆ తరువాత రాజకీయంగా, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగింది తన వల్లేనని శ్రీహరి చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు చెప్పి 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించినట్లు తెలిపారు. తాను ఎవరికీ వెన్నుపోటు పొడవలేదన్నారు. నిజాయితీ, నైతిక విలువలే తనకు రాజకీయ అవకాశాలు తెచ్చిపెట్టాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కడియం శ్రీహరి కొట్టి పారేశారు. డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే వరంగల్ లోకసభ నుంచి కడియం కావ్య తప్పకుంటుందని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి అని కడియం శ్రీహరి ఆరోపించారు. దళితులు, ముస్లింలు ఇతర మైనారిటీలపై బీజేపీ అరాచకంగా వ్యవహరిస్తుంటే.. ఆ పార్టీ పంచన ఎలా చేరుతారని శ్రీహరి ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ దళిత జాతి ఉద్ధారకుడని ఎలా అంటామని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాస్తూ దళిత జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు.

రమేశ్‌కు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఎన్నికకు ముందే ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. తన వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడంలోనే రమేశ్ పతనం ప్రారంభమైందన్నారు. ఆయనకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. వర్ధన్నపేటలో భూకబ్జాలు చేసింది చాలక ఇక మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కబ్జాల కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నాడని రమేశ్‌పై మండిపడ్డారు.

కావ్య గెలుపునకు కృషి

డాక్టరు కావ్య విజయం కోసం సమష్టిగా కృషి చేస్తున్నట్లు వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కావ్య వ్యక్తిగత విషయాలపై బీజేపీ, బీఆర్ఎస్ నోరు పారేసుకోవడం ఆ పార్టీల అభద్రతకు సంకేతమన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు దోపిడీ బట్టబయలైందన్నారు. కవిత లిక్కర్ కేసులో చిక్కుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో పెద్ద తలకాయ ఒకటి రెండు రోజులు బయటపడనుందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కరువు యాత్ర పేరిట రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కావ్య మూడు లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కబ్జాల చరిత్ర ఉన్న అరూరి రమేశ్‌కు కడియం శ్రీహరి, కావ్యను విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. కబ్జాల పాపం వల్లే అరూరి రమేశ్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని, ఎంపీగా కూడా ఇదే అనుభవం ఆయనకు దక్కనుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కబ్జాలకు పాల్పడిన రమేశ్ బీజేపీలో చేరగానే పునీతుడు కాలేడని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి, వర్ధన్నపేట ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, కార్పొరేటర్ తోట వెంకన్న, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడియం ఎమ్మెల్యే కాకముందే
నేను కాంట్రాక్టర్‌ను..

కడియం ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు.. ● ఇన్నాళ్లు అండర్ డ్రైనేజీ ఎందుకు గుర్తురాలేదు? ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి.. ● వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్


మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాకముందే 1991లో తాను క్లాస్‌వన్ కాంట్రాక్టర్‌నని, తన ఎదుగుదలలో ఎవరి ప్రమేయం లేదని స్వయంకృషితో, ప్రజల ఆశీస్సులతో రాజకీయ ప్రతినిధిగా ఎదిగానని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ చెప్పారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం లోక్‌సభ కన్వీనర్ కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగింది.

ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ప్రతీసారి నీతి, నిజాయితీకి కేరాఫ్‌గా చెప్పుకుంటున్న కడియం.. వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాడో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 40 ఏళ్లుగా మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీగా అధికారం అనుభవించి.. ఏనాడూ అండర్ డ్రైనేజీ మాట మాట్లాడనోడు.. ఇవాళ అండర్‌డ్రైనేజీ నిర్మిస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ టికెట్ ఇస్తే.. ఏంతీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరాడని ప్రజలు చర్చించుకుంటున్నారని విమర్శించారు. మూడోసారి ప్రధాని కాబోతున్న మోదీ బృందంలో ప్రతినిధిగా వరంగల్ నుంచి పంపిస్తే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సంగెం, మడికొండ టెక్స్‌టైల్ అభివృద్ధితోపాటు మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, ఈ ప్రాంత యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. ఏ విధంగా అభివృద్ధి చేశానో.. ఎంపీగా అవకాశం ఇస్తే రెట్టింపు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

నెంబర్ వన్ స్థానంలో వరంగల్

దేశంలోనే వరంగల్ లోక్‌సభ నెంబర్‌వన్ స్థానంలో నిలవబోతుందని తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు, రాష్ట్రంలో 12 సీట్లు బీజేపీ కైవసం చేసుకోబోతోందని జోస్యం చెప్పారు. కాగా, అంతకుముందు మండల, డివిజన్, బూత్ అధ్యక్షుల ఇంటింటికీ ప్రచారంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా బూత్ అధ్యక్షుల దగ్గర ఉండాలన్నారు. ప్రతీ ఇంటికి మోదీ, అభ్యర్థితో ఉన్న స్టిక్కర్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, మురళీధర్, విజయరామారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, నిశిధర్‌రెడ్డి, నాయకులు కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

న్యూశాయంపేట, ఏప్రిల్ 12: మాదిగల వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ సమాజానికి పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాజకీయంగా అణచివేస్తోందని, అలాంటి కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై చిత్తుగా ఓడించాలన్నారు. మాదిగలకు మొదటగా టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ పార్టీకి కూడా ఓట్లు వేయొద్దన్నారు. ఈ నెల 15వ తేదీన పరకాలలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల లోక్‌సభ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో మాదిగ కులస్థులు హాజరై విజయవంతం చేయాలని మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఏకు శంకర్, చేతల్ల రమేష్, శివ, శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


గవిచర్ల మోడల్ స్కూల్ ల్యాబ్‌లో పాఠ్యాంశాలను నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

అటకెక్కిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

అవగాహన లేకపోవడంతోనే పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని వైనం

ఆన్‌లైన్‌తో ఏమీ చేయాలో తెలియని అవగాహన రాహిత్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించి సృజనాత్మకతతో కూడిన వినూత్న ఆవిష్కరణలను సృష్టించే వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పేరుతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్రీయ, సాంకేతిక రంగాల వైపు అడుగులు వడేందుకు వారిని ఆ మేరకు ప్రోత్సహించేందుకు ఈ ల్యాబ్‌లను ఉపయోగించాలని సూచిస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ల్యాబ్ ఏర్పాటైన తర్వాత ఒక్కో యేడాదికి రూ.2లక్షలను నిర్వహణ ఖర్చుల కింద మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం ఆరు పాఠశాలలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపిక కాగా, ఇప్పటివరకు రెండు పాఠశాలల్లో మాత్రమే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన నాలుగు పాఠశాలల్లో వాటి ఊసే లేదు. హనుమకొండ జిల్లాలో నాలుగు ఎంపిక కాగా, రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు పూర్తిగా ఆన్‌లైన్‌తోనే ముడిపడి ఉండటం, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం లేదు. దీంతో ఎంపికైన పాఠశాలల్లో సైతం ల్యాబ్‌ల ఏర్పాటు జరగడం లేదు.

అంతా ఆన్‌లైన్‌తోనే ఇబ్బంది

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లనే ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లోనే విధివిధానాలు పొందుపరిచి ఉంటాయి. ఇక పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈపథకానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియదు. వారి పర్యవేక్షణ లేకుండానే కేంద్ర ప్రభుత్వం నేరుగా పథకాన్ని అమలు చేస్తుంది. దీంతో టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్న పాఠశాలలు సైతం దరఖాస్తు చేసుకోలేకపోతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులకే అవగాహన లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు సైతం ఎలాంటి ముందస్తు అవగాహన కల్పించలేకపోతున్నారు. అవగాహన రాహిత్యంతో ల్యాబ్‌ల ఏర్పాటుకు అడ్డంకిగా మారుతుంది.

శాస్త్రీయభావాన్ని పెంపొందించేందుకు..

పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ భావాన్ని పెంపొందుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కూడా అదే. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ భావన పెంపొందించి తద్వారా వినూత్న ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు చేస్తారనే ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు పూనుకుంది. పాఠశాలల్లోనే శాస్త్ర, సాంకేతిక వాతావరణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను వినూత్న ఆవిష్కరణలవైపు పయనించేలా చేయడమే టింకరింగ్ ల్యాబ్‌ల ఆశయం.

ఏర్పాటుకు రూ.12లక్షలు, నిర్వహణకు రూ.2లక్షలు

కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తొలుత ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ఆ తరువాత ప్రతీ యేడు నిర్వహణ ఖర్చుల కింద రూ.2లక్షల నిధులు మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలలు ఈ పథకానికి ఎంపిక కాగా, రెండు పాఠశాలల్లోనే పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. మిగతా నాలుగు పాఠశాలల్లో ఎలాంటి ముందడుకు పడలేదు. గవిచర్ల, పర్వతగిరి మోడల్ స్కూళ్లలో టింకరింగ్ ఏర్పాటు అయ్యాయి. ఇక ఎంపికైన ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్, ధర్మారం జడ్పీహెచ్‌ఎస్, నెక్కొండ జడ్పీహెచ్‌ఎస్, నర్సంపేటలోని జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అడుగులు పడలేదు. ఇక హనుమకొండ జిల్లాలో నాలుగు టింకరింగ్ ల్యాబ్‌లకు ఎంపిక కాగా, కేవలం మడికొండలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ఎల్కతుర్తిలోని మోడల్ స్కూల్లో మాత్రమే టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి.

మాకు సమాచారం ఉండటం లేదు..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించిన ఎలాంటి సమాచారం మాకు అందుబాటులో ఉండటం లేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లా సైన్స్ అధికారులకు సైతం ఎలాంటి సమాచారం ఉండటం లేదని వారు చెబుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. మాకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించలేకపోతున్నాము. ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపికయ్యాయనే కనీస సమాచారం సైతం మాకు అందుబాటులో ఉండటం లేదు.


కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో నాయకులతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నిరుత్సాహంలో తాటికొండ రాజయ్య

ఎర్రవెల్లికి వెళ్లి వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ టికెట్ విషయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. కేసీఆర్ నుంచి ఏ క్షణం లోనైన ఫోన్ వస్తుందని, అందుబాటులో ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమాచారం ఇచ్చారు. అయితే హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ కేసీఆర్‌తో ఫామ్‌హౌస్‌లో చర్చలు జరుపుతున్నాడనే విషయం తెలుసుకున్న రాజయ్య.. ఎర్రవెల్లికి వెళ్లకుండా సమీప గ్రామంలో నాయకులతో కలిసి వేచి ఉన్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ పేరు కేసీఆర్ ప్రకటించడంతో అసహనానికి గురైన రాజయ్య ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగి వచ్చారు. కాగా కేసీఆర్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బాధ్యతలు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి గెలుపు బాధ్యతలు రాజయ్యను తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. రాజయ్య వెంట వెళ్లిన నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్ రెడ్డి, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, కనకం గణేష్, రంగు హరీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో చాపర్తి సాంబలక్ష్మీ (56) అనే కూలీ మృతిచెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సాంబలక్ష్మీ శుక్రవారం ఉదయం ఇళ్లలో పనిచేసి వస్తూ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద కూరగాయలు తీసుకుంటుండగా ఆటో వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ఫోన్ చేసి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సాంబలక్ష్మీ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: నిబంధనలు ఉల్లంఘించిన 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 17 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందికి 17,300, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.4,200 జరిమానాను విధించారన్నారు.

ఇక సమరమే!



(5వ పేజీ తరువాయి)

కావ్య ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సైతం ఇప్పటికే అన్ని నియోజకవర్గాలల్లో ఒకసారి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ స్థాయిలో బూత్ కమిటీల సమావేశాలు కూడా నిర్వహించి కార్యకర్తల్లోకి చొచ్చుకు పోతున్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి శుక్రవారమే ఖరారవటంతో గెలుపే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో దిగి గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది.

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ముఖ్యనేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ గెలుపునకు సహకరించాలని, గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. మండుటెండలో కూడా అభ్యర్థులు ప్రచారంలో చెమటోడ్చుతున్నారు.

ఓట్ల లెక్కల్లో నేతలు..

2009లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ పార్లమెంట్ స్థానం పరిధిలో వరంగల్ లోక్‌సభ ఏర్పడింది. తొలుత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2016 (ఉపఎన్నిక), 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే మహబూబాబాద్ నుంచి 2009లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక చోట బీఆర్ఎస్ విజయం సాధించింది. మొత్తం కాంగ్రెస్‌కు 6,61,545ఓట్లు పోలవగా, బీఆర్ఎస్‌కు 5,02,578ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 1,58,967ఓట్ల ఆధిక్యాన్ని కాంగ్రెస్ సాధించింది. అయితే వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు పోలయ్యాయి. దీంతో పాటు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ చేరికతోపాటు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉండటంతో వర్ధన్నపేటలో కూడా బీజేపీకి కొంత బలం పెరిగిందనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతో పాటు తన కూతురు కావ్యను ఎంపీ అభ్యర్థిగా బరిలో దించటంతో కాంగ్రెస్‌కు అదనపు బలంగా భావిస్తున్నారు. దీంతో వరంగల్ పార్లమెంట్ స్థానంలో ట్రయింగిల్ ఫైట్ ఏర్పడింది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో కూడా ఏడింటిలో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక చోట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు పోలు కాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు వచ్చాయి. బీజేపీకి ఇక్కడ కేవలం 34,426 ఓట్లే పోలయ్యాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 2,41,987ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్ సాధించింది. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరటంతో కాంగ్రెస్‌కు అనదపు బలం చేకూరిందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీలకు సంప్రదాయంగా వస్తున్న ఓట్లను పరిగణంలోకి తీసుకుని ఆయా పార్టీల నేతలు గెలుపు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆయా పార్టీలకు పోలైన ఓట్లు

లోక్‌సభ స్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353
మహబూబాబాద్	2009	3,94,447	3,25,490(సీపీఐ)	1,45,299(పీఆర్‌పీ)
మహబూబాబాద్	2014	2,85,577	3,20,569	2,15,904 (టీడీపీ)
మహబూబాబాద్	2019	3,15,446	4,62,109	25,487(బీజేపీ)
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,85,897	4,43,910	34,426(బీజేపీ)

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి



(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేసీఆర్ అనూహ్యంగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించడంతో నేతలంతా అధినేత నిర్ణయానికి తప్పనిపరిస్థితిలో ఒప్పుకున్నట్లు సమాచారం. మొత్తంగా రాజయ్యకే వరంగల్ ఎంపీ టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో కేసీఆర్ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడం గమనార్హం.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ ప్రస్తుతం హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా (1995-2000), కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా (2001-2006) కాలంలో పదవిలో ఉన్నారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సుధీర్‌కుమార్.. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు ప్రధాన అనుచరుడు.

సుధీర్‌కుమార్‌కు కేసీఆర్ ఫోన్

సుధీర్‌కుమార్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ నివాసం, విద్యాభ్యాసం, వరంగల్‌తో ఉన్న అనుబంధం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని తేలిందన్నారు. వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్ అని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను వెళ్లి కలవాలని కేసీఆర్ సూచించారు. 15న సమన్వయ కమిటీ సమావేశం ఉంటుందని, జిల్లా నేతలను అందరిని కలిసి సహకారం తీసుకుని విజయం సాధించాలని కేసీఆర్ సూచించారు. కాగా, ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు, సహకరించిన జిల్లా నేతలకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కేటీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం

గణపురం, ఏప్రిల్ 12 : గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ) మొదటి దశ విద్యుత్ ఉత్పత్తికి గురువారం అర్ధరాత్రి అంతరాయం ఏర్పడింది. మొదటి దశ 500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులో బాయిలర్ ట్యూబ్ లీకేజీ సమస్య తలెత్తడంతో ప్రాజెక్టును షట్‌డౌన్ చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం తెలిపారు. మరమ్మతులు చేస్తున్నామని, రెండు రోజుల్లో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా, రెండో దశ 600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

పాఠశాలలో ఆకట్టుకున్న ఓపెన్‌హౌస్


తల్లికి విద్యను వివరిస్తున్న విద్యార్థి అక్షిత

వెంకటాపూర్ (రామప్ప), ఏప్రిల్ 12 : ఓపెన్‌హౌస్ కార్యక్రమాలతో చిన్నారుల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత, విజ్ఞానం, నైపుణ్యం పెరుగుతుందని వేదవ్యాస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాలలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు పర్యావరణం, సైన్స్ టెక్నాలజీ తదితర అంశాలపై నిర్వహించిన చిత్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పసునూటి రాజయ్య, చింతిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం



సమావేశంలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం నాయకులు

కాకతీయఖని, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీపీఐ, సీపీఎం నాయకులు టి.శ్రీనివాసరావు, వెంకటేశ్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని కొమురయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. బీజేపీని ఓడిస్తేనే దేశానికి రక్షణ ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పదిలంగా ఉండాలంటే బీజేపీని సాగనంపాలని తెలిపారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే పేదలకు భవిష్యత్ ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు రాజ్‌కుమార్, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో కుంకుమార్చన


సీతారామచంద్ర స్వామి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి లలితా దేవీశరన్నవ రాత్రుల్లో భాగంగా కలశ స్థాపన సహిత కుంకుమార్చన పూజలను అర్చకుడు యల్లప్రగడ నాగేశ్వర్ రావు శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దుర్గామాత కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన పూజలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కలశారాధన, లలిత అష్టోత్తరం కుంకుమార్చన, లలితాదేవి సహస్ర పారాయణం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో మహిళలు చేశారు. అంతేకాకుండా అమ్మవారికి ప్రత్యేక పిండి వంటలతో ప్రసాదాలను చేసి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడవిలో సాసర్ పిట్లు

- మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ ఏర్పాట్లు
- జంతువుల వేటను ఆపేందుకు కెమెరా ట్రాప్స్
- పలిమెల రేంజ్ పరిధిలో 14 సాసర్ పిట్లు, 8 కెమెరాలు


కామన్‌పల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లు


లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో నీటిని నిల్వ చేసేందుకు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 12 : పలిమెల అటవీ రేంజ్ పరిధిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అటవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని కామన్‌పల్లి, పలిమెల, నీలంపల్లి, ముకునూర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పలిమెల రేంజ్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. సాసర్ పిట్లతో పాటు నీటి లభ్యత ఉన్న చోట జంతువులు నీరు తాగే విధంగా ఏర్పాటుచేశారు. సాసర్‌పిట్లతో పాటు పలు చోట్ల కెమెరా ట్రాప్స్ సైతం అమర్చినట్లు చెప్పారు. నీటి కోసం వచ్చే జంతువులను లెక్కించేందుకు ఈ కెమెరా ట్రాప్స్ ఉపయోగపడతాయని, అలాగే నీటి సౌకర్యం ఉన్న చోట వేటగాళ్లు ఉచ్చులు ఏర్పాటు చేస్తే కెమెరా ట్రాప్స్‌తో సులభంగా గుర్తించవచ్చని ఆయన తెలిపారు. మండలపరిధిలోని అటవీ ప్రాంతంలో మొత్తం 14 సాసర్‌పిట్లు, 8 కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేసినట్లు ఎఫ్ఆర్‌వో స్పష్టం చేశారు. కాగా, కెమెరా ట్రాప్స్‌లో చిక్కిన పలు అటవీ జంతువుల ఫొటోలను విడుదలచేశారు.

కాంగ్రెస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

మల్హర్, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంథనిలో శనివారం జరిగే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ భూపాలపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు రమేష్ శుక్రవారం పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించుకునేందుకు పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, దళిత కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి : కాంగ్రెస్


బోరునర్సాపురంలో కార్యకర్తలకు సూచనలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మంగపేట, ఏప్రిల్ 12: మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ, సీనియర్ నాయకులు, జిల్లా, మండల, నియోజకవర్గ నాయకులు బూత్‌ల వారీగా ప్రత్యేక సమావేశాలు పెట్టుకొని సమన్వయంతో పని చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైల జయరామిరెడ్డి, కారుపోతుల నర్సయ్యగౌడ్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలను శుక్రవారం కలిసి త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా పనిచేయాలో వ్యూహాలను వివరించారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో ప్రజల్లో ఉండి సమస్యలను తెలుసుకొని పని చేయాలన్నారు. ముఖ్యంగా యువత గ్రామ కమిటీలతో కలిసి కష్టపడి పనిచేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గాదె శ్రావణ్‌కుమార్, ఆకుతోట వెంకన్న, కార్యదర్శులు ఎంపెల్లి సమ్మయ్య, మండల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ


నల్లా ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్న అధికారులు

కాటారం, ఏప్రిల్ 12 : మండలంలోని ఇబ్రహీంపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను అధికారులు శుక్రవారం పరిష్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రమేష్, ఏఈ రాజశేఖర్, జీపీ ప్రత్యేకాధికారి డీటీ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌లు గ్రామంలో తిరిగి తాగునీటి సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పలువురు మహిళలు గురువారం ఖాళీ బిందెలతో జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించగా అధికారులు కాలనీలో తిరిగి సమస్యకు కారణం తెలుసుకున్నారు. గామంలో కొందరు అక్రమంగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో నల్లాల వద్ద ఏర్పాటు చేసిన ఎఫ్‌సీవీ(ఫ్లో కంట్రోల్ వాల్వ్)లను తొలగించడంతో ఎస్సీ కాలనీలో కొందరి ఇళ్లకు నీటి సరఫరా సక్రమంగా జరగలేదని అధికారులు తెలిపారు. ఎఫ్‌సీవీలను తొలగించిన వారిని హెచ్చరించామని, మరోసారి పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.

ఏటూరునాగారంలో యువ సంకల్ప్ యాత్ర


ఏటూరునాగారంలో యువ సంకల్ప్ యాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 12 : ఏటూరునాగారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం యువ సంకల్ప్ యాత్రను యువ మోర్చా జిల్లా నాయకుడు చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్ హాజరై మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్ నిర్ణయించేవని అన్నారు. ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పదేళ్ల పాలనలో మోదీ దేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంచారని, ఆర్థిక రంగంలోను మొదటి నుంచి ఐదవ స్థానంలో ఉంచారన్నారు. అతి క్లిష్టమైన రామ మందిరం, ట్రిపుల్ తలాక్, కశ్మీర్‌లో 370 యాక్ట్ రద్దు లాంటి ఎన్నో నిర్ణయాలు తీసుకుని జీ20 సదస్సులను విజయంగా నిర్వహించారని తెలిపారు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం, రామప్పకు యునెస్కో గుర్తింపు, నాలుగు లైన్ల రహదారి, ములుగు టూరిజంకు నిధులు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సత్యం, నాయకులు గద్దల హరిబాబు, పెయ్యల రాకేష్, పురాణం ప్రకాష్, పెయ్యల లభిషేక్, మరి రాజు, ఎంపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 12: భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని కమలాపూర్ క్రాస్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. భూపాలపల్లి ఎస్సై సంధ్యారాణి నేతృత్వంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల వేళ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు భూపాలపల్లి జాతీయ రహదారి మీదుగా వచ్చి వెళ్లే వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

మల్హర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి మహనీయుల జీవిత చరిత్రలను తెలిపే పుస్తకాలను ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బండి రాజయ్య, కాళేశ్వరం జోనల్ ఏవైయూ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్ శుక్రవారం అందజేశారు. ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు వేముల జ్యోతి, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ ఆదేశాల మేరకు సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేడ్కర్ తదితరుల గ్రంథాలను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు బండి సుధాకర్, కేశారపు సురేందర్, గుగిళ్ల రాజ్‌కుమార్, రావుల మొగిలి, అఖిల్, తమ్మిశెట్టి ప్రభాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు, ఎక్స్‌కవేటర్ పట్టివేత

- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు


బూర్నపల్లిలో లారీలను పట్టుకున్న పోలీసులు

టేకుమట్ల, ఏప్రిల్ 12 : మండలంలోని బూర్నపల్లి గ్రామ శివారులోని మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం... బూర్నపల్లి శివారులోని మానేరు నుంచి ఎక్స్‌కవేటర్ సహాయంతో లారీలలో ఇసుకను లోడ్ చేస్తూ తరలిస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మానేరులో లారీ డ్రైవర్లు పట్టుబడడంతో విచారించగా బూర్నపల్లికి చెందిన రేణుకుంట్ల సుమన్, కరీం నగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన సదానందంలు జేసీబీ సహాయంతో ఇసుకను లారీలలో నింపి తరలిస్తున్నారని తెలిసిందన్నారు. కాగా, రెండు లారీలతో పాటు ఎక్స్‌కవేటర్‌ని స్వాధీనం చేసుకొని లారీ డ్రైవర్స్ అయిన నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన రాచకొండ సతీష్, నారాయణపూర్ జిల్లా యాదాద్రికి చెందిన కత్తుల నరసింహ, లారీల ఓనర్ ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన ఇమ్రాన్, జేసీబీ డ్రైవర్, ఓనర్ అయిన కటకం సాయిరాంతో పాటు ఇసుక దందాకు పాల్పడుతున్న రేణుకుంట్ల సుమన్, సదానందంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై ఆమరేందర్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది మహేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

15న పరకాల సదస్సును విజయవంతం చేయాలి

- ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జాతీయ నేత సూరన్న

భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 12 : పరకాల పట్టణంలో ఈ నెల 15న జరిగే వరంగల్ పార్లమెంట్ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న పిలుపునిచ్చారు. భూపాలపల్లి పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూరన్న హాజరై మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గతంలో నుంచి మాదిగలకు అడ్డుపడుతూనే ఉన్నారని అన్నారు. పార్లమెంట్ టికెట్లు మాదిగలకు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని తెలిపారు. దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్‌లకు దక్కకుండా చేసి తన కూతురుకు వచ్చేలా చేశారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కేవలం గడ్డం వివేక్ కుటుంబం మాత్రమే బాగుపడుతుందని అన్నారు. అక్కడ మాదిగలు లేరా..అని ప్రశ్నించారు. ఇలా ప్రతీసారి మాదిగలకు రాజకీయాల్లో తీరని అన్యాయం జరుగుతుందని ధ్వజమెత్తారు. కాగా, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని 15న పరకాలలో నిర్వహిస్తున్నందున ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉపకులాల వారు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంఎస్‌పీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గాజుల భిక్షపతి, హనుమకొండ ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, నాయకులు రాజేందర్, బొల్లిబాబు, భరత్, శ్రీనివాస్, భద్రయ్య, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 12 : ములుగు మండలంలోని ములుగు, పత్తిపల్లి, కాసిందేవిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు జరగనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

- భూపాలపల్లిటౌన్ : భూపాలపల్లి పట్టణంలోని జంగేడు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బధిరుల ఉన్నత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 12 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో ప్రవేశం కోసం జిల్లాలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.లక్ష్మీనర్సమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల హనుమకొండ ప్రగతినగర్ కాలనీ ఫేస్-2, మయూరి గార్డెన్ లైన్‌లో 38 సంవత్సరాల నుంచి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచిత విద్యాబోధన, వసతిగృహ సౌకర్యం ఉందని, అర్హులైన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు 6300585912, 9440739423, 8801117608, 9866673486, 8008136309 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చి'వరి'కి ఇలా..!

- నీరందక ఎండిపోయిన వరి పొలాలు
- అడుగంటిన భూగర్భ జలాలు, ఎత్తిపోతున్న బోర్లు
- పడిపోయిన దిగుబడులతో రైతుల ఆందోళన


మండలంలోని దేవరాంపల్లిలో ఎండిపోయిన వరిపంట

కాటారం, ఏప్రిల్ 12 : మండుతున్న ఎండలు.. అడుగంటిన భూగర్భ జలాలు.. ఎత్తిపోయిన బోర్లు.. వెరసి చి'వరి'కి నీరు అందక నెర్రెలు బారుతున్న పొలాలు, ఎండుతున్న వరి పంటతో సగానికి పైగా దిగుబడులు పడిపోవడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. మండలంలోని దేవరాంపల్లి, రేగులగూడెం, శంకరంపల్లి, బూడిదపల్లి, కొత్తపల్లి, చల్లపల్లి, జాదరావుపేట శివారులో గల వరి పొలాలకు బోర్ల ద్వారా నీరు సక్రమంగా అందక ఎండిపోయాయి. గత కొన్ని నెలల నుంచి ఒక్క వర్షం కూడా లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎత్తిపోతున్న పరిస్థితితో పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు నీటిని కొద్దిగానే పోస్తుండటంతో తేలికపాటి నేలలకు తోడుగా మండే ఎండలకు పొలాలు నెర్రెలు బారి వరి ఎండిపోతున్నదని రైతులు వాపోతున్నారు. పలువురు రైతులకు చెందిన పొలాలు సక్రమంగా నీళ్లు అందక వడ్ల గింజలు పాలు పోసుకునే దశలో ఎండిపోయాయి. కొన్ని బోర్లు ఇప్పటికే ఎత్తిపోయాయని, మరికొన్ని బోర్లు కొద్ది పాటి నీళ్లే పోస్తున్నాయన్నారు. మండే ఎండలు, భూగర్భ జలాలు లేక మోటార్ల ద్వారా నీరు అందక ఒక మడిలోనే కొంత భాగం వరి ఎండిపోతుండగా, మరికొంత భాగం పచ్చగా ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంట ఆఖరి దశలో ఎండిపోతున్న పొలాలతో నష్టాల పాలయ్యే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఎండిపోయిన పంటలకు పరిహారం అందించాలని కోరుతున్నారు. గతంలో యాసంగిలో ఎకరాకు 28-35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేవి. ప్రస్తుతం ఎత్తిపోయిన బోర్ల కింద ఎండిపోయిన పొలాల్లో ఎకరాకు 10-12 క్వింటాళ్ల వరకే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాగా. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోయిన 12 మండలాల్లో కాటారం మొదటి స్థానంలో ఉంది. మండలంలోని రేగులగూడెం, శంకరంపల్లి, జాదరావుపేట జీపీల పరిధిలో భూగర్భజలాలు మరింత లోతుగా అడుగంటి డేంజర్ జోన్‌లో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

అదుపుతప్పి దూసుకెళ్లిన ఇసుక లారీ

తాడ్వాయి, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట డివైడర్‌ను ఢీకొట్టుకుంటూ వెళ్లి మసీదు సమీపంలో రోడ్డు కిందికి ఓ ఇసుక లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న 10 టైర్ల ఇసుక లోడు లారీ డ్రైవర్లు మద్యం మత్తులో ఆశ్రమ పాఠశాల ఎదుట గల డబుల్‌రోడ్డు మధ్యలో గల డివైడర్‌లను మూడుచోట్ల ఢీకొట్టగా అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. గమనించిన గ్రామస్థులు డ్రైవర్లను బయటకు తీశారు. డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. అయితే డ్రైవర్లు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసు అధికారులు, ఆర్టీఏ అధికారులు స్పందించి లారీ డ్రైవర్లపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మండల కేంద్రంలో డివైడర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, లారీని ఎక్స్‌కవేటర్ల సహాయంతో పక్కకు తీశారు.


ఎక్స్‌కవేటర్ల సహాయంతో లారీని పక్కకు తీస్తున్న దృశ్యం